ధరూర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ యాస్మిన్ బాషా

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

■ కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 7: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రత్యేకాధికారులను ఆదేశించారు. బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ధరూర్ ఎస్సీ కాలనీలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని 387 గ్రామాల్లో ఈ నెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులను నియమించామన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తించి మొక్కలు నాటాలని తెలిపారు. తాగునీటి ట్యాంకులను ప్రతి నెలా 1, 11, 21వ తేదీల్లో శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, కార్యర్శులు పాల్గొన్నారు. చల్‌గల్‌లో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి సస్పెన్షన్‌పై కోర్టు స్టే

స్టే ప్రతులను చూపుతున్న కరుణాకర్‌రెడ్డి

పెగడపల్లి, ఫిబ్రవరి 7: నామాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఇనుగాండ్ల కరుణాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పెద్ది సంతోష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిపై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌పై బుధవారం కోర్టు స్టే విధించింది. గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేయగా, జిల్లా పంచాయతీ అధికారులు విచారణ జరిపారు. నిధులు దుర్వినియోగం జరిగాయని పేర్కొంటూ, జనవరి 30న వారిని సస్పెండ్ చేశారు. దీనిపై మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంటనే కోర్టుకు వెళ్లగా, బుధవారం వారి సస్పెన్షన్‌పై కోర్టు స్టే విధించింది. కాగా సర్పంచ్, ఉప సర్పంచ్ పదవీ కాలం ఫిబ్రవరి 1నే పూర్తి కాగా, పంచాయతీ కార్యదర్శి తిరుపతికి కోర్టు స్టేతో తిరిగి విధుల్లో చేరే అవకాశం ఉంది.

అధికార పార్టీ కుట్రతోనే సస్పెన్షన్: నామాపూర్ తాజా మాజీ సర్పంచ్

అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల కుట్ర పన్ని తనను అన్యాయంగా సస్పెండ్ చేయించారని నామాపూర్ తాజా మాజీ సర్పంచ్ ఇనుగాండ్ల కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిర్ర రమణాకర్, పెద్ది సంతోష్‌తో కలిసి ఆయన కోర్టు స్టే ప్రతులను ప్రదర్శించారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా చివరకు న్యాయమే గెలిచిందని స్పష్టం చేశారు.

రాజన్న ఆలయంలో టెండర్లు

సారంగాపూర్, ఫిబ్రవరి 7: పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం అధికారులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామగ్రిని అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. హెచ్చుపాట రూ. 5.60లక్షలు, పూలు, పండ్లు అమ్ముకునే హక్కుకు రూ. 16వేలు, చెప్పుల స్టాండ్‌కు రూ. 5వేలు వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపక సభ్యుడు శంకరయ్య, డివిజనల్ పరిశీలకుడు రవిశంకర్, ఈవో అనూష, విండో చైర్మన్ పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం

కొడిమ్యాల(మల్యాల) ఫ్రిబవరి 7: మల్యాల సింగిల్ విండో చైర్మన్ ముత్యాల లింగారెడ్డిపై బుధవారం ఏడుగురు డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన కాపీని జిల్లా సహకార అధికారికి అందజేశారు. సొసైటీలో 13 మంది డైరెక్టర్లు ఉన్నారు.

డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : జగిత్యాల డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం విధుల్లో చేరారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజారెడ్డి ఇటీవల నిర్మల్ జిల్లా భైంసాకు బదిలీ కాగా, కరీంనగర్ ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను జగిత్యాల డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జిల్లా అధ్యక్షుడిగా పిట్టల వంశీ

ఇబ్రహీంపట్నం, పిబ్రవరి 7 ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మోపా)జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన పిట్టల వంశీ ముదిరాజ్‌ను నియమించినట్లు మోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ బుధవారం తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బొజ్జ నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా నేమూరి నరేశ్, సంయుక్త కార్యదర్శులుగా బత్తిని కిషన్, చొప్పరి శ్రీనివాస్ ను నియమించినట్లు వెల్లడించారు.

సైబర్ నేరాలపై అవగాహన

మెట్‌పల్లి, ఫిబ్రవరి 7: మెట్‌పల్లి డిగ్రీ కళాశాలలో బుధవారం సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ చిరంజీవి సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకయ్య, ఉపన్యాసకులు మనోజ్‌కుమార్, మధుబాబు, గట్టయ్య, అంజయ్య పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్స్ పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 7 : రామాజీపేట్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ కండ్లపెల్లి సాయి కుమార్ పరీక్షా ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, స్కేళ్లను బుధవారం పంపిణీ చేశారు. హెచ్ఎం నరేందర్, మాజీ ప్రజాప్రతినిధులు మోహన్, హరీశ్‌రావు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

కొడిమ్యాల, ఫిబ్రవరి 7 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయానికి గ్రామానికి చెందిన ముమ్మాడి బ్రహ్మయ్య–దేవేంద్ర దంపతులు రూ.25,216 విరాళాన్ని బుధవారం పూజారి నాగరాజు రమేశ్‌కు ఇచ్చారు. ఆలయ సభ్యులున్నారు.

రైతులకు అవగాహన

కోరుట్ల రూరల్,ఫిబ్రవరి 7 : ఎకీన్‌పూర్‌లో ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో–ఆపరేటివ్ సంస్థ ఫీల్డ్ డే సందర్భంగా ప్యాక్స్ అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ శ్రీధర్ ఎరువుల వాడకంపై పలు సూచనలు చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కేసీఆర్ కల... డబుల్ బెడ్రూం ఇండ్లు

■ మౌలిక వసతులు కల్పిస్తున్నాం.. ■ ఓట్ల కోసమే సమీక్షలా..?
■ మౌలిక వసతులు లేనిచోట ఇందిరమ్మ ఇండ్లు ఎలా నిర్మిద్దామనుకున్నారు..? ■ ధరూర్, చల్‌గల్‌లో స్థలం ఉన్నా ఎందుకు ఉపయోగించుకోలేదు ■ జగిత్యాలలో కాంగ్రెస్ పాలనలో ఎన్ని ఇండ్లు ఇచ్చారు ■ ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే సంజయ్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, ఫిబ్రవరి 7: అగ్గిపెట్టేలాంటి ఇందిరమ్మ ఇండ్ల స్థానంలో పేదోళ్లు ఆత్మగౌరవంగా బతికేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, డబుల్ బెడ్రూం ఇండ్లు కేసీఆర్ కల అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నూకపల్లిలో 100 ఎకరా ల్లో స్థలం సేకరించి ఇక్కడ ఇండ్ల నిర్మా ణం చేపట్టింది మీరు కాదా అని జీవన్‌రెడ్డిని సంజయ్ ప్రశ్నించారు. మౌలిక వసతులు లేని ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్లను ఎలా ఇద్దామని అనుకున్నారని నిలదీశారు. గత ప్రజాప్రతినిధులు ధరూర్ క్యాంప్‌లో 260 ఎకరాల్లో మంచి స్థలం సేకరించినా ఉపయోగించుకోలేదని, నూకపల్లిలో ఇండ్ల ని ర్మాణం చేపట్టడం మీ తప్పే అని విమర్శించారు. చల్‌గల్‌లో జీవన్‌రెడ్డి రాజకీయాలకు రాక ముందే వలంతరి క్షేత్రం ఉందని, చల్‌గల్‌లో కూడా ఇందిరమ్మ ఇండ్లు ఏర్పాటు అవకాశం ఉన్నా స్వార్థపూరితంగా నూకపల్లిలో ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు.

డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల అని, కరోనా వల్ల పనుల్లో కొంత ఇబ్బందులు తలెత్తినా ఇండ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్సీ రమణతో వెళ్లి కలిసి మరికొన్ని నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. కేసీఆర్ నగర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని, ఇంకా 800 ఇండ్లు పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. కొంతమంది అర్హులు ఉన్నా కూడా సాంకేతిక కారణాలతో ఇల్లు పొందలేని పరిస్థితి ఉందని పేర్కొనారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లపై రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంక్‌లో ఉన్న 3,920 కోట్ల విలువైన లోన్లను మాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. 75 సంవత్సరాల్లో 42 సంవత్సరాలు జగిత్యాలలో అధికారంలో మీరే ఉన్నారు కదా అని, పేదల కోసం ఎన్ని ఇండ్లు కట్టించారో చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు.

మౌలిక వసతులు కల్పిస్తున్నాం

నూకపెల్లిలో నిర్మించిన4520 డబుల్ బెడ్రూం ఇండ్లకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. 520 ఇండ్లకు పూర్తిస్థాయిలో కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, టీఆర్‌నగర్ వద్ద రూ.7 కోట్లతో సంపు ఏర్పాటు చేసి, సరస్వతీ టెంపుల్ వద్ద ఓవర్ హెడ్‌ట్యాంక్ కట్టి పూర్తి స్థాయిలో నీళ్లు ఇచ్చామన్నారు. 4 వేల ఇండ్లకు రూ.14.80 కోట్లతో మిషన్ భగీరథ ఇంట్రా పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. 4520 ఇండ్ల నిర్మాణం చేపట్టామని, దేశంలో ఎక్క డా ఇంత పెద్ద మొత్తంలో ఎక్కడా నిర్మాణం చేయలేదన్నారు.

భూ ఆక్రమణపై జీవన్‌రెడ్డి స్పందించాలి

రూ.22 కోట్లతో మిషన్ భగీరథ పనులు జరుగుతున్నాయని, 520 ఇండ్లకు రోడ్డు కోసం గత కాంగ్రెస్ హయాంలో ఓ దాత ఇచ్చిన భూమిని నేడు ఆక్రమించారని, మాజీ మంత్రి దీనిపై స్పందించాలన్నారు. రోడ్డుకు పరిష్కారం చూపాలని, డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో గతంలో ఎన్నడూ సమీక్షలు, సందర్శనలు చేయని మాజీ మంత్రి, ఇప్పుడు ఎందుకు సమీక్ష చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రాబోయే ఎంపీ ఎన్నికలు దృష్ట్యా ఓట్ల రాజకీయం చేయవద్దని హితవు పలికారు. రాజకీయాలకు అతీతంగా పేద వారి ఇండ్ల నిర్మాణనికి, వారు అక్కడ నివసించడానికి సహకరిద్దామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, కౌన్సిలర్లు బొడ్ల జగదీశ్, జుంబర్తి రాజ్ కుమార్, అల్లె గంగాసాగర్, నాయకులు సింగారావు, అడువాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

సారంగాపూర్, ఫిబ్రవరి 7: లచ్చనాయక్ తండా బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు అన్నెడ ప్రభాకర్ రెడ్డి రోడ్డుప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రభాకర్ రెడ్డిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

మెట్‌పల్లి రూరల్: జగ్గసాగర్‌లో రోడ్డుపై చెత్తను తొలగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ప్రజల సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత

■ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ■ జగ్గసాగర్‌లో శ్రమదానం

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 7: ప్రజల సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. బుధవారం జగ్గసాగర్‌లో గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు. ఇక్కడ ఎంపీపీ సాయి రెడ్డి, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు, ఏఎన్ ఎంలు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మెట్‌పల్లి, ఫిబ్రవరి 7: ఇబ్రహీంపట్నం మండలకేంద్రానికి చెందిన గనవేణి గోపికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్ష ఎల్‌వోసీ ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ కల్వకుంట్ల బుధవారం అందజేశారు. గోపి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఎల్వోసీకి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.లక్ష చెక్కును మెట్‌పల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో అందజేశారు.

ఎన్ఎస్ఎస్ శిబిరానికి హాజరు

కోరుట్ల రూరల్,ఫిబ్రవరి 7: ధర్మారంలో పీవీ నర్సింహారావు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ ముగింపు శిబిరంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం అయిలాపూర్‌లో విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, ఎంపీటీసీ గంగాధర్, పశువైద్యశాల డీన్ మాధవరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి పరశురాం, జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయంలో టెండర్లు

కొడిమ్యాల(మల్యాల), ఫిబ్రవరి 7 : కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి సంబందించిన 8 టెండర్లను బుధవారం కరీంనగర్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అధికారులు నిర్వహించారు. సంవత్సరానికి టెండర్లు నిర్వహించగా కూరగాయలు, పాలు, పెరుగు సప్లయి చేయడానికి సత్యం రెడ్డి, పూలు పండ్లు సప్లయి చేయడానికి మల్లేశం, దుస్తులకు శ్రావణ్ కుమార్, ప్రింటింగ్‌కు కిషన్, శానిటేషన్‌కు ఆంజనేయులు, స్టేషనరీకి ప్రవీణ్‌కుమార్ టెండర్ దక్కించుకునట్లు ఈవో టంకశాల వెంకటేశం తెలిపారు. తలనీలాలు పోగు చేసుకొనుటకు రూ.కోటీ 62 లక్షల 1116 గతంలో కన్నా తక్కువ టెండర్‌ను వెంకటనర్సమ్మ పాడగా టెండర్‌ను వాయిదా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారుతీస్వామి, ఏఈవో వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్లు శ్రీనివాస్ శర్మ, సునీల్, సెక్షన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వర్‌రావు తదితరులున్నారు.

సీఏలో ప్రతిభ చూపిన యువకుడికి సన్మానం

కోరుట్ల, ఫిబ్రవరి 7: పట్టణంలోని పద్మశాలీ కులోన్నతి సంఘ భవనంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఏ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన చిరుమల్ల ప్రీతమ్‌ను సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. ఇక్కడ నాయకులు నాగభూషణం, మధు, జగదీశ్వర్, ప్రసాద్, ధనుంజయ్, కవిత తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

మ్యాన సంతోష్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మపురి, ఫిబ్రవరి 7: ధర్మపురికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మ్యాన శంకర్ కుమారుడు సంతోష్‌కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బుధవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే దోనూర్ గ్రామానికి చెందిన గొల్లెన తిరుపతి కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

సద్వినియోగం చేసుకోవాలి

సారంగాపూర్, ఫిబ్రవరి 7: కిశోర బాలికలు టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమేశ్ సూచించారు. కరీంనగర్‌లోని దుర్గాబాయ్ మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కిశోరబాలికలకు 45 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వగా బుధవారం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఇక్కడ సీడీపీఓ వాణిశ్రీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు లత, శైలజ, నీలిమ, పంచాయతీ కార్యదర్శి శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

కుట్లు ఆరక.. పుండు మానక..!

ప్రసవం తర్వాత రెండోసారి కుట్లతో మహిళ అవస్థ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ దవాఖానలో ప్రసవించిన ఓ మహిళ వైద్యురాలు ఆపరేషన్ చేసిన తర్వాత కుట్లు ఆరకపోవడంతో అవస్థలు పడుతున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణికి గత నెల 13న మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రిలో వైద్యురాలు శస్త్ర చికిత్స చేసి ప్రసవం జరిపారు. పాపను మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మహిళను గత నెల 17న మెట్‌పల్లి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఇంటికి వెళ్లిన తర్వాత సదరు మహిళకు కుట్లు పికిలిపోయి నీరు కారి పుండ్లు కావడంతో కుటుంబ సభ్యులు ఏఎన్ఎం సాయంతో నాలుగు రోజుల తర్వాత మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యురాలు మూడు రోజులు దవాఖానలోనే ఉండాలని సూచించారు. దీంతో నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న పాప వద్దకు కుటుంబ సభ్యులు మహిళను తీసుకెళ్లారు. తర్వాత నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో మహిళకు కుట్లను తొలగించారు. అనంతరం పాప సహా ఇంటికి వచ్చిన మహిళకు పుండు మానక ఇబ్బంది పడడంతో ఆరు రోజుల క్రితం మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన సంబంధిత వైద్యురాలు మళ్లీ రెండోసారి కుట్లు వేసి, ఇంటికి పంపారు. కాగా గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా సంబంధిత గ్రామానికి వెళ్లిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దృష్టికి బాధితులు సమస్యను తీసుకెళ్లారు. దీంతో వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ విషయమై దవాఖాన సూపరింటెండెంట్ సాజిద్ అహ్మద్‌ను వివరణ కోరగా, సిజేరియన్ తర్వాత కొందరికి కుట్లు ఆరక ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. దీంతో రెండోసారి కుట్లు వేస్తామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు సాధారణంగా జరుగుతాయని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వాసుపత్రిలోని సంబంధిత వైద్యురాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గతంలోనూ పలు విమర్శలు తలెత్తాయి. శస్త్ర చికిత్స తర్వాత రెండోసారి కుట్లు వేయడం సదరు వైద్యురాలికి పరిపాటిగా మారిందని ఆరోపణలున్నాయి.

ఆర్థిక సాయం అందజేత

రాయికల్, ఫిబ్రవరి 7 : ద్యావనపల్లికి చెందిన విలేకరి మాలవత్ వెంకటేశ్ ఇటీవల వాహన ప్రమాదానికి గురై తీవ్రమైన గాయాల పాలై జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం రాయికల్ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూ.24 వేలు దస్తా లేఖరులు సింగిడి శంకరయ్య రూ.10వేలు, మహ్మద్ రషీద్ రూ.10వేలు, ఇమ్మడి విజయ్ కుమార్ 5వేలు, చౌడారపు సతీశ్ రూ.5వేలు, కొండ కల్యాణ్ రూ.2వేలు, మరో ముగ్గురు వెయ్యి రూపాయల చొప్పున మొత్తం రూ.36 వేల నగదు రాగా వెంకటేశ్ భార్యకు బుధవారం అందజేశారు. ఇక్కడ ప్రెస్‌క్లబ్ జేఏసీ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు సాయికుమార్, కోశాధికారి శేఖర్, శ్రీనివాస్, కిరణ్‌రావు ఉన్నారు.

దేశ వ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల, ఫిబ్రవరి 7:పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు దేశ వ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, కేంద్రం ప్రవేశపెట్టిన లెబర్ కోడ్ బిల్లు, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 16న దేశ వ్యాప్త కార్మికుల సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 7 : మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి సమైక్య సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని డీఆర్‌డీవో నరేశ్ సూచించారు. బుధవారం కోరుట్లలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సమాఖ్య సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో శివాజీ, సుధీర్, ఏపీఎంలు, వీవోఏలు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మల్లాపూర్, ఫిబ్రవరి 7: ఈ నెల 11న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా గంగపుత్రుల మహాసభను విజయవంతం చేయాలని టీపీసీసీ షిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాయణ పిలుపునిచ్చా రు. బుధవారం సంబంధిత కరపత్రాలను సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, మండలాధ్యక్షుడు రొడ్డ రాజు, నాయకులు రవీందర్, నర్సయ్య, ప్రభాకర్, నాగరాజ్, రాజేందర్, నవీన్, నడ్పినర్సయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కోరుట్ల, ఫిబ్రవరి 7: పట్టణంలోని టీచర్స్ క్లబ్ భవనంలోలో బుధవారం లయన్స్ క్లబ్, కోరుట్ల కోటి నవదుర్గ మహిళా లయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్యూపంక్చర్, మ్యాగ్నటిక్ వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆక్యూపంక్చర్ థెరపిస్ట్ సంతోష్ గోస్వామి, సురేందర్